సాక్షి
కుమురం భీం
గురువారం । 6 । జూన్ । 2024



శునకాల బెడద తప్పేనా..?
మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఎనిమల్ కేర్ సెంటర్ ప్రారంభమైంది. ఇక్కడ శునకాలకు సంతానోత్పత్తి కలగకుండా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. 8లో▸



సన్నాల సాగుకే మొగ్గు!
వానాకాలం సీజన్‌లో వరి రైతులు సన్నాల సాగుకే ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో దొడ్డు రకం సాగు తగ్గనుంది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.1 /28.0
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం మంత్రి సీతక్కను కలిసి జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో సుమారు 50వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని విన్నవించారు. పీఆర్సీ నిర్ణయించిన మినిమం బేసిక్ రూ.19,500 వేతనంగా చెల్లించాలని అప్పటిలోగా జీవో 60 ప్రకారం వేతనాలు అందించాలన్నారు. జీవో 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పాత కేటగిరీలు యథావిధిగా కొనసాగించాలన్నారు. అదేతరహాలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్లాస్టిక్ వాడకంతో అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.నరేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బుధవారం పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఇన్‌చార్జి జీఎం మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణి సీఎండీ సందేశాన్ని ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం ఫైనాన్స్ రామారావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయం



'అరిగెల'ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సమష్టి కృషితోనే ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ విజయం సాధించిందని జెడ్పీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం వివిధ సంఘాల నాయకులు, బీజేపీ నేతలు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గతంలో లేనంతగా మద్దతు తెలిపిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు ఖాండ్రె విశాల్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జయరాజ్, నాయకులు పెంటయ్య, సత్తన్న, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

29 మంది గైర్హాజరు

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్ బాబు తెలిపారు. బుధవారం హిందీ పరీక్షకు 46 మంది విద్యార్థులకు 17 మంది హాజరు కాగా.. 29 మంది గైర్హాజరయ్యారు.

ఫలించిన వ్యూహాలు

- సిర్పూర్ నియోజకవర్గంలో బీజేపీకి మెజార్టీ
- జోష్ పెంచిన ప్రముఖుల పర్యటనలు
- జిల్లాలో పార్టీ ఎమ్మెల్యేలు లేకున్నా కాంగ్రెస్‌కు పెరిగిన ఓటుబ్యాంకు
- మంత్రి సీతక్క ప్రచారంతో 'ఆసిఫాబాద్'లో మెజార్టీ
- మాజీ ఎమ్మెల్యే సక్కుకు కలిసి రాని లోక్‌సభ ఎన్నికలు



ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల పర్వం ముగిసింది. గెలిచిన వారికి ఆనందం.. ఓడిన వారికి ఆవేదన మిగిల్చిన ఎన్నికలు చివరి వరకు ఉత్కంఠ రేపాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు తీవ్రస్థాయిలో పని చేశారు. నియోజకవర్గ స్థాయిలో మెజార్టీ సాధించేందుకు ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళ్లారు. బీజేపీ, కాంగ్రెస్ వ్యూహాలు ఫలించడంతో జిల్లాలో రెండు పార్టీలు అనుకున్న రీతిలో ఓట్లు సాధించాయి. బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం స్థానికంగా ఎమ్మెల్యే ఉన్నా అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఓటుబ్యాంకును కోల్పోయింది.

పట్టు నిలుపుకొన్న కమలం

జిల్లాలో ఒక్కో మండలంలో ఒక్కో విధంగా రాజకీయ పరిస్థితులు ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటిసారి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సిర్పూర్ సీటును దక్కించుకుంది. ఇదే ఊపులో ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని దక్కించుకునేందుకు సోయం బాపూరావు స్థానంలో బీఆర్‌ఎస్ నుంచి పార్టీలో చేరిన గోడం నగేశ్‌కు టికెట్ కేటాయించింది. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం కొనసాగించారు. కేంద్ర మంత్రి అమిత్‌షా కాగజ్‌నగర్ పర్యటన ఆ పార్టీలో జోష్ నింపింది. జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, సిర్పూర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, పార్టీ శ్రేణులతో కలిసి కాగజ్‌నగర్ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని బలమైన శ్రేణులను తమవైపు తిప్పుకోవడంలో సక్సెస్ అయ్యారు. ముఖ్యంగా బెంగాళీలను ఆకట్టుకునేందుకు ముందస్తు కసరత్తు చేపట్టారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉండటంతో ఇక్కడ ప్రచార బాధ్యతలు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు భుజాలకు ఎత్తుకున్నారు. స్థానిక నాయకులతో కలిసి పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీంతో ఊహించిన్నట్లుగా నిర్మల్, ముధోల్‌తోపాటు సిర్పూర్‌లో బీజేపీ ప్రభావం చూపింది. ఇక్కడ మొత్తం 71,325 ఓట్లు సాధించి కాంగ్రెస్‌పై బీజేపీ 8,369 ఓట్ల ఆధిక్యం సాధించింది.

ఎమ్మెల్యేలు లేకున్నా కాంగ్రెస్‌కు ఓట్లు

గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని రెండు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు శ్యాంనాయక్, రావి శ్రీనివాస్ ఓటమి పాలయ్యారు. అయినా రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ పట్టు నిలుపుకోవడం విశేషం. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. జిల్లాలోనే మకాం వేసి గ్రామాల్లోని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు సైతం స్థానికంగా ఎమ్మెల్యే లేకున్నా మంత్రి సీతక్క సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తామని ప్రజల్లో నమ్మకం కలిగించే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసిఫాబాద్‌లో నిర్వహించిన సభ కూడా పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. బూత్‌ల వారీగా లెక్కలు తీస్తూ ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేశారు. ఎన్నికలకు ముందు చేరికలనూ ప్రోత్సహించారు. అందులో భాగంగానే సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీలో చేరారు. మైనార్టీ నాయకులు కూడా అధిక సంఖ్యలో హస్తం గూటికి చేరారు. ఈ క్రమంలోనే ఆదిలాబాద్ పార్లమెంటరీ పరిధిలో ఏడు సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ బీజేపీ కంటే వెనుకంజలో ఉండగా.. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మాత్రం అధిక ఓట్లు సాధించింది. ఇక్కడ ఆ పార్టీకి కాంగ్రెస్ అభ్యర్థి సుగుణకు 73,996 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి 47,056 ఓట్లు వచ్చాయి. 26,940 ఓట్ల మెజార్టీ లభించింది.

సక్కుకు తప్పని నిరాశ



ఆత్రం సక్కు

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా పని చేసిన ఆత్రం సక్కుకు పార్లమెంట్ ఎన్నికలు తీవ్ర నిరాశ మిగిల్చాయి. ముఖ్యంగా ఎన్నికలకు ముందు ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరడం ఓటింగ్‌పై ప్రభావం చూపింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి గిరిజన ప్రాంతాలతోపాటు జిల్లా కేంద్రంలో విస్తృతంగా ప్రచారం చేపట్టగా.. ఎమ్మెల్సీ దండె విఠల్ సిర్పూర్ నియోజకవర్గంలో పర్యటించి మండలస్థాయి నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధిని ఓటర్లకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోవడంతో రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు బీఆర్‌ఎస్‌ను పట్టించుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే దాదాపు 50 వేల ఓట్లు తగ్గాయి. ఎమ్మెల్యేగా పని చేసిన ఆసిఫాబాద్ నియోజకవర్గంలో సక్కు 38,597 ఓట్లు సాధించగా.. సిర్పూర్ సెగ్మెంట్‌లో కేవలం 19,840 ఓట్లకే పరిమితం కావాల్సి వచ్చింది.

కమలోత్సాహం



కౌటాల మండల కేంద్రంలో బీజేపీ నాయకుల సంబురాలు

- 'పార్లమెంట్' సీటు మరోసారి కైవసం చేసుకున్న నేపథ్యంలో..
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రాతినిధ్యంలోనూ బీజేపీ ప్రభావం
- గ్రామీణ ప్రాంతాల్లోనూ పెరిగిన 'కాషాయ' ఓటు బ్యాంక్
- 'స్థానిక' ఎన్నికలకు ముందు కేడర్‌లో జోష్

మొత్తం ఓట్లు	:	16,50,175
పోలైన ఓట్లు	:	12,35,597
శాతం	:	74.03

అభ్యర్థులు సాధించిన ఓట్లు..

గోడం నగేశ్ (బీజేపీ)	5,68,168 (45.98 శాతం)
ఆత్రం సుగుణ (కాంగ్రెస్)	4,77,516 (38.65 శాతం)
ఆత్రం సక్కు (బీఆర్‌ఎస్)	1,37,300 (11.11 శాతం)
మెజార్టీ(బీజేపీ)	90,652 ఓట్లు

సాక్షి,ఆదిలాబాద్: కమలం పార్టీలో ఉత్సాహం కనిపిస్తోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని తిరిగి దక్కించుకోవడం, మెజార్టీ కూడా పెరగడం ఇందుకు కారణం. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, సిర్పూర్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఆదరణ ఉంటుందని ఆ పార్టీ మొదటి నుంచి అంచనా వేసింది. ఇందుకు తగ్గట్టుగా నిర్మల్, ముధోల్‌లో పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ దక్కింది. అలాగే సిర్పూర్, ఆదిలాబాద్‌లోనూ గత అసెంబ్లీ ఎన్నికలను మించి అత్యధికంగా ఓట్లు పోలయ్యాయి. ఈ విధంగా ఈ నియోజకవర్గాల్లో కమలదళం బలం మరింత పెరిగింది.

ప్రత్యర్థుల క్షేత్రాల్లోనూ..

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాలుగు స్థానాల్లో గెలుపొందగా, ఆసిఫాబాద్, బోథ్‌లో బీఆర్‌ఎస్, ఖానాపూర్‌లో కాంగ్రెస్ గెలుపొందాయి. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బోథ్, ఖానాపూర్‌లోనూ బీజేపీ విజయ దుందుంభి మోగించింది. ఇటు బీఆర్‌ఎస్, అటు కాంగ్రెస్‌కు మించి అత్యధికంగా ఓట్లు దక్కించుకుంది. ఒక్క ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్‌కు మెజార్టీ లభించింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో మూడోస్థానంలో నిలిచిన బీజేపీ ఈ నియోజకవర్గంలో రెండో స్థానానికి ఎగబాకింది. తద్వారా ప్రత్యర్థుల క్షేత్రాల్లోనూ పాగా వేస్తుంది. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ అన్ని నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు రావడంతో ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహం కనిపిస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లోనూ..

బీజేపీకి ప్రధానంగా పట్టణ పరిధిలో ప్రాబల్యం ఉంటుందని ముందు నుంచి రాజకీయంగా చర్చ సాగేది. అయితే ఈ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లోనూ ఓట్లు సాధించామని సోషల్ మీడియాలో పలువురు ఆయా మండలాల నుంచి సాధించిన మెజార్టీకి సంబంధించి పోస్టులు పెడుతున్నారు. ఈ పరిణామం కమలం పార్టీలో మరింత ఉత్సాహం నింపుతుంది. ప్రధానంగా రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల పరంగా పార్టీకి ఇది ఉపయుక్తంగా ఉంటుందని ప్రస్తుతం చర్చ సాగుతుంది. గత స్థానిక సంస్థల ఎన్నికల పరంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేవలం ఆదిలాబాద్ జిల్లా నుంచి బీజేపీ ఐదు జెడ్పీటీసీ స్థానాలు సిరికొండ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, ఇచ్చోడలో గెలుపొందింది. పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన ఓట్ల శాతంతో ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ పలువురు బీజేపీ నుంచి పోటీ చేయాలనే ఆసక్తి కూడా కనబర్చుతున్నారు. మొత్తంగా ఈ అంశాలు ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

పంచభూతాలను కాపాడుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం భట్, వైద్యసిబ్బంది

- డీఎంహెచ్‌వో తుకారాం భట్

వాంకిడి(ఆసిఫాబాద్): పంచభూతాలైన గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశాన్ని కాపాడుకోవాలని డీఎంహెచ్‌వో తుకారాం భట్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వాతావరణం కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నగరీకరణతో ఏర్పడే వాయు కాలుష్యంతో గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుందన్నారు. గాలి, నీటి కాలుష్యంతోనే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మొక్కలు పెంచి అడవులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వాతావరణ సమతుల్యత దెబ్బతింటే అతివృష్టి, అనావృష్టితో భయానక పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామాల్లో వాతావరణంపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పర్యావరణానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, వైద్యులు వినోద్, వినయ్ ఉప్రె, సూపర్‌వైజర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అభివృద్ధికి సమష్టి కృషి

- సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- ఎంపీ గోడం నగేశ్



మాట్లాడుతున్న గోడం నగేశ్

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి స్థానిక బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కృషి చేస్తానని ఎంపీగా గెలిచిన గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి మాట్లాడారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా కష్టపడ్డారన్నారు. అందరి సమన్వయంతోనే గెలుపు సాధ్యమైందన్నారు. ఈ విజయాన్ని ప్రధాన నరేంద్ర మోదీకి అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ పరిధిలోని ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే జిల్లా కేంద్రంలోని రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జికి సంబంధించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 50 శాతం వాటాలతో వంతెనలు నిర్మించేలా అనుమతులు వచ్చాయన్నారు. అలాగే జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్మూర్ రైల్వేలైన్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, జాతీయ రహదారుల విస్తరణ, ఇతర సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా ప్రజలు తమ వైపే నిలబడి విజయాన్ని అందించారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు రావుల రాంనాథ్, అదినాథ్, అశోక్ ముస్తాపురే, విజయ్, మయూర్ చంద్ర, దినేష్ మటోలియా, లాలా మున్నా, ప్రవీణ్, రాజేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు అడ్డుకట్ట!

- అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కుటుంబాల సర్వే
- ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో వివరాలు నమోదు



ఆసిఫాబాద్‌లో వివరాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ టీచర్(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకం. ఆయా కేంద్రాల ద్వారానే ప్రభుత్వం పాలు, గుడ్లు, బాలామృతం, పౌష్టికాహారం తదితరాలు సరఫరా చేస్తోంది. అయితే అనేక చోట్ల పర్యవేక్షణ లేక సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. జైనూర్ ఐసీడీఎస్ పరిధిలో చిన్నారులకు అందించాల్సిన పాలను అక్రమంగా విక్రయించిన ఘటనలో ఓ అధికారిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం పట్టకుండా కుటుంబాల సర్వే చేపట్టింది. ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గర్భిణులు, చిన్నారులు, కిశోర బాలికలు, దివ్యాంగుల వివరాలను సేకరించి న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం యాప్‌లో నమోదు చేస్తున్నారు.

973 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో మొత్తం ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో గర్భిణులు 4,572 మంది ఉండగా.. బాలింతలు 4,439 మంది, ఆరేళ్లలోపు చిన్నారులు 48,192 మంది, కిశోర బాలబాలికలు 8,172 మంది, దివ్యాంగులు 3,623 మంది ఉన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కుటుంబాల సర్వేను మార్చిలోనే ప్రారంభించినా ఎన్నికల నేపథ్యంలో కొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం సేకరిస్తున్న వివరాలను ఎప్పటికప్పుడు ఎన్‌హెచ్‌టీఎస్, పోషన్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,20,790 కుటుంబాలను సర్వే చేసినట్లు అధికారులు వెల్లడించారు.

బలోపేతం దిశగా చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యనందించేందుకు ఇప్పటికే వీటిని ప్రీస్కూళ్లుగా మార్చుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే జిల్లాలో 450 సెంటర్లను మొదటి విడతలో ఎంపిక చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ.. గుడ్లు, పాలు, పౌష్టికాహారం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందించేందుకు కార్యాచరణ రూపొందించింది. అందులో భాగంగానే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు కుటుంబాల సర్వే నిర్వహిస్తోంది. చాలాచోట్ల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మొక్కుబడిగా పని చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మెనూ పాటించకుండా చిన్నారులకు ఇష్టారీతిన వండిపెడుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సర్వేలో కుటుంబ యజమానితోపాటు ఇంటి సభ్యుల వివరాలు, వయస్సు, ఫోన్ నంబర్, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా లబ్ధిదారుల హాజరు వివరాలు పక్కాగా నమోదు చేసేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. సరుకుల పంపిణీ వివరాలు సదరు లబ్ధిదారుల ఫోన్‌కు మేసేజ్ రూపంలో వెళ్తుందని అధికారులు చెబుతున్నారు. వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు, పోషకాహార లోపం, రక్తహీతన, ఎత్తుకు తగిన బరువు లేకపోవడం వంటివి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

పకడ్బందీగా వివరాల సేకరణ

అంగన్‌వాడీ టీచర్లు ఇతర విధుల్లో పాల్గొనడంతో కుటుంబాల సర్వే కొంత ఆలస్యమైంది. ఈ నెలాఖరులోగా పూర్తి వివరాలు సేకరిస్తాం. సర్వేతో సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పడుతుంది. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదు. సర్వేలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలు పకడ్బందీగా సేకరిస్తాం.

– భాస్కర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

నీట్ ర్యాంకర్‌కు అభినందన

కాగజ్‌నగర్‌రూరల్: జాతీయ స్థాయిలో మెడికల్ ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్‌లో 60,921 ర్యాంకు(బీసీ కేటగిరి) సాధించిన పట్టణంలోని మెయిన్ మార్కెట్‌కు చెందిన సిరిసహస్రను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిత దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో బుధవారం శాలువాతో సన్మానించారు. స్టెతస్కోప్ బహుమతిగా అందించారు. నీట్ ర్యాంకర్ సిరిసహస్రతోపాటు ఆమె తల్లిదండ్రులు దాసరి లక్ష్మణ్, మమతను బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ క్రికెట్ క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు మధు, కిరణ్, నాగరాజు, రమేశ్, సతీశ్, వెంకటేశ్, రాజీ, శ్రీనివాస్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



స్టెతస్కోప్ అందిస్తున్న శ్రీనివాస్, అనిత

ఎంపిక జాబితా విడుదల

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మెరిట్ రోస్టర్ ప్రకారం గ్రూపులో 40 చొప్పున మొత్తం 160 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారి జాబితాను కళాశాలలోని నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఈ నెల 8లోగా ఒరిజినల్ టీసీ, బోనఫైడ్, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, రెండు సెట్ల జిరాక్సులతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని విద్యార్థుల అడ్మిషన్ రద్దవుతుందని స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న, అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని రేంజ్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల గుండా రెబ్బెన ఇన్‌చార్జి అధికారి శ్రీధరచారితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం పూర్తిగా కలుషితం అవుతుందన్నారు. అవసరాల కోసం ప్రకృతిని నాశనం చేయడం ప్రారంభించిన నాటి నుంచి చివరకు మానవ మనుగడే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు గాలి, నీటి, భూమిని కాలుష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. చెట్లతో ఆక్సిజన్ లభించడంతోపాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు సరోజారాణి, రాజేశ్వర్, సెక్షన్ అధికారులు సాయి, సతీశ్, భగవంత్‌రావ్, సత్యనారాయణ, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

లింగాపూర్: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పిక్లాతండాలో చోటు చేసుకుంది. ఎస్సై కొట్టే ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బోడా దేవులిబాయి (59) కొంతకాలంగా మద్యం సేవించి ఇరుగు పొరుగు వారితో గొడవ పడుతుండేది. ఆమె కుమారుడు బోడా శంకర్ మందలించడంతో మనస్తాపానికి గురైంది. బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడు బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హాజీపూర్ మండలం పెద్దంపేటలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బెంబడి బక్కయ్య(70) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య పోసు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుతపులి దాడిలో చుక్కలదుప్పి హతం



దుప్పి కళేబరం

రామకృష్ణాపూర్: బొక్కలగుట్ట గాంధారిఖిల్లాలో చిరుతపులి దాడిలో చుక్కల దుప్పి హతమైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఖిల్లా దిగువ భాగానికి వెళ్లిన ఉపాధిహామీ కూలీలు దుప్పి కళేబరాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వేసవి దృష్ట్యా దాహం కోసం వచ్చిన దుప్పిపై చిరుతపులి దాడి చేయడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

భయాందోళనలో గ్రామస్తులు

చిరుతపులి సంచారం, దుప్పి మృతి ఘటన గాంధారి ఖిల్లా పరిసర ప్రాంతాల్లో అలజడి రేపుతోంది. కొన్ని నెలల క్రితం చిరుతపులి సంచరిస్తున్న విషయం బయటకు రావటం ఇప్పుడు దుప్పి కళేబరం వెలుగులోకి రావడంతో సహజంగానే ఆందోళన మొదలైంది. గాంధారి ఖిల్లా పరిసర గ్రామాలైన బొక్కలగుట్ట, పులిమడుగు ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. కాగా ఈ దాడి ఘటన మంచిర్యాల జిల్లాలో సంచలనం రేపింది.

శునకాల బెడద తప్పేనా..?



జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో గుంపులుగా వీధి కుక్కలు

- అనిమల్ కేర్ సెంటర్‌లో శస్త్ర చికిత్సలు ప్రారంభం
- రోజురోజుకూ పెరుగుతున్న వీధి కుక్కల బాధితులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో కుక్కకాటుకు గురవుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. కుక్కలను నియంత్రించేందుకు మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఆండాళమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఇటీవల మున్సిపల్ అధికారులు ప్రారంభించి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేస్తుండగానే ఏదో ఒక ప్రాంతంలో ప్రజలను గాయపరుస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం మంచిర్యాల మున్సిపాలిటీలోనే కుక్కలను పట్టుకునే కార్యక్రమాన్ని చేపడుతున్నా ఈ ఎనిమల్ కేర్ సెంటర్‌లో జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లోని వీధి కుక్కలను తీసుకువచ్చి, సంతానోత్పత్తి కలగకుండా శస్త్ర చికిత్సలు చేసి, ఎక్కడి నుంచి తీసుకువచ్చారో అదే ప్రాంతంలో తిరిగి వాటిని వదలాల్సి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం ప్రతీనెల జిల్లాలో సగటున 90 మంది కుక్కకాటుకు గురవుతున్నట్లు తెలుస్తోంది. అయితే కుక్కకాటుకు గురయ్యే వారి సంఖ్య దీనికి మూడు రెట్లకు పైగానే ఉంటుందని తెలుస్తోంది. కుక్క కరిచిన వారు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే రేబీస్ వ్యాక్సిన్‌ను వేసి గాయాలకు చికిత్స చేసి పంపిస్తున్నారు.

వీధుల్లో గుంపులు గుంపులుగా..

ఇటీవల కాలంలో వీధుల్లో రోడ్లపై శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులతో పాటు, పెద్దలపైనా దాడికి దిగుతున్నాయి. వీధి కుక్కలను నియంత్రించక పోవడంతో ప్రజలు గాయాల పాలవుతున్నారు. వీధి కుక్కలపై ఎలాంటి చర్యలను తీసుకున్నా జంతు ప్రేమికులు ఏం చేస్తారోననే భయం, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయనే ఉద్దేశ్యంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న శునకాలతో వీధుల్లో నుంచి నడుస్తూ వెళ్లేందుకు ప్రజలు భయపడి పోతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోనే ఓ పిచ్చికుక్క చేసిన దాడిలో దాదాపుగా 40 మందికి పైగా ఒకేసారి గాయపడ్డారు. ఒకే కుక్క పదుల సంఖ్యలో ప్రజలను కరవడంతో పాటు, పశువులు, ఇతర వీధి కుక్కలను కరిచింది. స్థానికులు దానిని పట్టుకుని చంపినా ఇతర వీధి కుక్కలను కరవడంతో మరింత ప్రమాదం పొంచి ఉంది. చున్నంబట్టివాడలో మార్బల్ పనులు చేసుకునే వ్యక్తి ఎడమచేతి బొటనవేలిని కుక్క కొరికి పట్టుకుపోవడంతో అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుక్క కాటుకు గురైన వారి సంఖ్య పెరుగుతుండడంతో, వీధుల్లోకి వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ఎప్పటికప్పుడు కుక్కలకు రేబీస్ టీకాలను వేయించక పోవడం వల్లనే కుక్కలు ప్రజల మీదకు దాడి చేసి కరుస్తున్నాయి. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లోని శునకాల సంతతిని నియంత్రించేందుకు ప్రత్యేకంగా అనిమల్ కేర్ సెంటర్‌ను మంచిర్యాల మున్సిపాలిటీలోని ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డు సమీపంలో పది నెలల క్రితం రూ.35 లక్షలతో నిర్మించారు. ఇందులో శునకాల సంతతిని నియంత్రించే ఆపరేషన్లు చేసి అవి కోలుకునే వరకు వాటిని ఉంచేందుకు ప్రత్యేకంగా కేజెసర్(పంచరం) వంజరం జాలీలతో కూడిన షెడ్‌ను నిర్మించారు. అయినా వీధుల్లో శునకాలు గుంపులుగా తిరుగుతుండడం భయాందోళన కలిగిస్తోంది.



కుక్కకు కు.ని ఆపరేషన్ చేస్తున్న వైద్యుడు

జిల్లాలో ఆరేళ్లుగా కుక్కకాటుకు గురైనవారు

సంవత్సరం	బాధితులు
2019	3,048
2020	2,460
2021	2,168
2022	1,685
2023	2,,277
2024	450(జూన్ 2 వరకు)

ఇటీవలే ప్రారంభించాం



మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన అనిమల్ కేర్ సెంటర్‌ను ఇటీవలే ప్రారంభించాం. 80 కుక్కలకు శస్త్ర చికిత్స చేయించాం. వీధి కుక్కల బెడద ఇటీవల ఎక్కువైంది. అందుకే అనిమల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించాం.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఆర్కే 5 గనిపై మొక్క నాటుతున్న జీఎం సంజీవరెడ్డి

- జీఎం సంజీవరెడ్డి
- గనులపై పర్యావరణ దినోత్సవం

శ్రీరాంపూర్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం సింగరేణి ఆధ్వర్యంలో పలు గనులు, డిపార్టుమెంట్లపై పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయం, ఆర్కే 8 డిస్పెన్సరీ, ఆర్కే 5 గనిపై జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న జీఎం ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల ప్రాణుల మనుగడ పర్యావరణం మీద ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏజెంట్ గోపాల్ సింగ్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, డిప్యూటీ సీఎంవో రమేష్‌బాబు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, ఆర్కే 5గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ బాజీసైదా, ఆర్కే 6 గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే 6 గనిపై..

గని మేనేజర్ తిరుపతి ఆధ్వర్యంలో ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సందర్భంగా పర్యావరణం పై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసు శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, డిప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, గుర్తింపు సంఘం నాయకులు ముస్కె సమ్మయ్య, తోట మహేష్, చిలక రాంచందర్, నగేష్, సురేష్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో..

ప్రాజెక్టు అధికారి టీ.శ్రీనివాస్ పర్యావరణ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గని మేనేజర్ శ్రీనివాస్, పర్యావరణ అధికారి జలాలుద్దీన్, అధికారుల సంఘం ప్రతినిధి కరీముద్దీన్, పిట్ సెక్రెటరీ మోతే లచ్చన్న,సంక్షేమాధికారి శంకర్ పాల్గొన్నారు.

పర్యావరణ వేడుకల బహిష్కరణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో బుధవారం నిర్వహించిన పర్యావరణ వేడుకలను ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో కార్మికులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీఎం వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారి పట్ల వివక్షత చూపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సీహెచ్‌పీలో సమస్యలను, సేఫ్టీని కూడా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు తమ సమస్యల కొరకు అతని వద్దకు వెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్ని సార్లు చెప్పినా వైఖరి మార్చుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు బుస్స రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

వేమనపల్లి: ప్రాణహిత నది ఫెర్రీపాయింట్ వద్ద బుధవారం ఉదయం నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్, మండల వ్యవసాయాధికారి వీరన్న ఆధ్వర్యంలో 2.5 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాసులు తెలిపారు. సీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ప్రాణహిత నది అవతలి వైపు ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరోంచ తాలూకా కోటపల్లికి చెందిన కోల సాయికిరణ్ నకిలీ విత్తనాలను ఎడ్లబండిలో ప్రాణహిత నది దాటించి వేమనపల్లి వైపునకు వస్తుండగా పట్టుకున్నారు. ఎడ్లబండిలోని ఏడు సంచుల్లో 2 క్వింటాళ్ల 5 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. పోలీసులను గమనించి కోటపల్లికి చెందిన కోల రమేష్ అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఎడ్లబండితో సహా నిందితుడు కోల సాయికిరణ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నకిలీ విత్తనాలను మహారాష్ట్రలోని ఆస్తికి చెందిన సుమిత్ , తాళ్లటేకడకు చెందిన జంగ సంపత్‌ల వద్ద నుంచి తీసుకొచ్చినట్లు నిందితుడు వెల్లడించాడు. మంచిర్యాల జిల్లాలో విక్రయించేందుకు ఎడ్లబండిద్వారా తరలించినట్లు తెలిపారు. సాయికిరణ్ ఎడ్లబండితో దొరికిపోగా మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారు. నకిలీ పత్తి విత్తనాలను, నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై శ్యాంపటేల్, కానిస్టేబుళ్లు రాజేందర్, రాజశేఖర్‌లను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్, తదితరులు పాల్గొన్నారు.



నిందితుడు, విత్తనాలతో సీపీ, పోలీసులు

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ



సుహిత వర్మ



శ్రీజ

దండేపల్లి: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షల్లో దండేపల్లి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన కానగంటి మల్లేశ్ కుమార్తె సుహితవర్మ 511 మార్కులు, నర్సాపూర్ గ్రామానికి చెందిన పూరెల్ల నాగన్న కుమార్తె శ్రీజ 503 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పలువురు అభినందించారు.

బెల్లంపల్లి సీఓఈ విద్యార్థుల ప్రభంజనం



జుమ్మిడి ప్రణయ్



గోమాస అఖిల్



యెరెకర్ నికిత్

బెల్లంపల్లి: నీట్ ఫలితాల్లో బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు మెరిశారు. 26 మంది విద్యార్థులు హాజరు కాగా 11 మంది అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. జుమ్మిడి ప్రణయ్ 404 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచాడు. గోమాస అఖిల్ 375, మౌల్కర్ శివకృష్ణ 333, యెరెకర్ నిఖిత్ 293 మార్కులు సాధించారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఓఈ సూపరింటెండెంట్ అవధూత రాజశేఖర్, సిబ్బంది తేజశ్వీ, సమేందర్, తదితరులు పాల్గొన్నారు.

అద్దె వాహన యజమానుల సమ్మె

శ్రీరాంపూర్: సింగరేణిలో అద్దె ప్రాతిపదికన కార్లు, జీపులు, వ్యాన్లు నడుపుతున్న ఓసీపీ నిర్వాసితులు బుధవారం నుంచి కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో వాహనాలు నిలిపివేసి సమ్మెలో పాల్గొన్నారు. దీంతో శ్రీరాంపూర్‌లో సుమారు 80 వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద వాహన యజమానులు అప్పాల కుమార్, మోహన్, మేకల శేఖర్ తదితరులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంపీఎఫ్ డబ్బులను చెల్లించే విషయంలో తమకు జరుగుతున్న నష్టానికి నిరసనగా ఈ సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. కంపెనీ నిబంధనలు, కోర్టు ఆదేశాల ప్రకారం డ్రైవర్లకు సీఎంపీఎఫ్ కట్టాల్సి ఉందన్నారు. అయితే మార్చిలో తమకు చెల్లించిన బిల్లులో కంపెనీ 15 శాతం సీఎంపీఎఫ్ కట్ చేసుకొని బిల్లులు ఇచ్చిందని, దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. పాత బిల్లులు పూర్తిగా చెల్లించాలని, ఈ నెల నుంచి సీఎంపీఎఫ్ కట్ చేసుకోవాలని కోరగా యాజమాన్యం ఒప్పుకోకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా నెలలో 26 రోజుల వర్కింగ్ డేస్‌కే సీఎంపీఎఫ్ రికవరీ చేయాలని కోరారు. వాహనాల సమ్మెతో అధికారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇతర వాహనాలను, అధికారుల పర్సనల్ వాహనాలను, కొన్నిచోట్ల టెండర్ వాహనాలను వినియోగించుకున్నారు. డిమాండ్లపై ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డితో చర్చించగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో సమ్మె కొనసాగిస్తామని వారు తెలిపారు.



సమ్మెలో పాల్గొన్న వాహన యజమానులు

ఒకరిపై కేసు నమోదు

వాంకిడి: హత్యాయత్నానికి పాల్పడిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. వాంకిడి మండలంలోని ఇందానికి చెందిన ఛటారె సోమకు అదే గ్రామానికి చెందిన బుజ్జితో వివాహమైంది. కొన్ని రోజుల క్రితం మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. 15 రోజుల క్రితం పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి బుజ్జికి విడాకులు ఇప్పించారు. దీన్ని మనసులో పెట్టుకున్న సోమ బుజ్జి చిన్నాన్న కుమారుడు మందాడే సుధాకర్‌పై బ్లేడుతో గొంతుపై దాడి చేశాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లిన కుటుంబ సభ్యులు వెంటనే సుధాకర్‌ను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సుధాకర్ తమ్ముడు రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాపు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

జైనూర్: యువతిని ప్రేమించి మోసగించిన ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అంజయ్య తెలిపారు.కాగజ్‌నగర్ మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమించి మోసం చేసిన అజర్ ఖురేషి, అతనికి సహకరించిన సోహెల్ ఖురేషి, రఫిక్,ఇమ్రాన్, సత్తార్‌లపై ఎ స్సీ, ఎస్టీ అట్రాసిటితో పాటుపలు సెక్షన్‌లపై కే సులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: 'తరలిపోతున్న రేషన్ బియ్యం ' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా సివిల్ సప్‌లై అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని రేషన్ షాపు 11 నుండి ఈ నెల 4న పీడీఎస్ బియ్యం ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చింది. స్పందించిన సివిల్ సప్లయ్ అధికారులు సదరు రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు మధుసూధన్‌రావు, వరదరాజులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత నెల 24న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన కారుకూరి రాజమణి (53) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. గుడిపేటకు చెందిన రాజమణి కొంతకాలంగా అనారోగ్యంతో పాటు ఇంటి సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త సత్తయ్య, కుమారులు అంజనేప్రసాద్, ప్రశాంత్ ఉన్నారు. కుమారుడు అంజనేయప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



మొక్క నాటుతున్న జడ్జి రవి

చెన్నూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెన్నూర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు అంతరించిపోతే మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, ఏజీపీ రాంబావు, ఫారెస్ట్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అడవుల పెంపకం కోసం పాటుపడాలి

భీమారం: అడవుల పెంపకం కోసం అందరూ పాటుపడాలని జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాధా రాథోడ్‌తో కలిసి మొక్కలు నాటారు.

ఏరియా ఆస్పత్రికి గ్రీన్ ఛాంపియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏసీఎంవో

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి గ్రీన్ ఛాంపియన్ అవార్డు లభించింది. ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం, పారిశుధ్యం మెరుగ్గా నిర్వహిస్తుండటంతో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ అవార్డును ప్రకటించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి ఏసీఎంవో డాక్టర్ ఉషారాణి ఈ అవార్డును అందుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జైపూర్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పవర్ ప్లాంటు జీఎం బసివిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని పవర్‌ప్లాంటులో పర్యావరణ–నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించడానికి అందరూ కృషి చేయాలన్నారు. సింగరేణి సంస్థ ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎం ప్రసాద్, శ్రీనివాస్‌లు, రమణ, సీఎంవోఏఐ సెక్రెటరీ సంతోశ్‌కుమార్, సీఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శేఖర్, పీఎంపీఎల్ మేనేజర్ అఖిల్‌కపూర్, డీజీఎం వాసుదేవ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జీఎం బసివిరెడ్డి

'తాళ్లపెల్లి'కి సన్మానం



రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న ఆర్టిస్టులు

జన్నారం: ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జన్నారంకు చెందిన తాళ్లపెల్లి రాజేశ్వర్‌ను బుధవారం మండల కేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ నేత, రాజేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది యువకులు తమ కళలను నమ్ముకుని జీవిస్తున్నారని, వారిని ప్రభుత్వ పరంగా గుర్తింపు తేవడానికి కృషి చేస్తానన్నారు.

8నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి: టీజీ ఈసెట్–2024 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈనెల 8 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి తెలిపారు. 8 నుంచి 10 వరకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈనెల 18 లోపు విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారని వెల్లడించారు. 18 నుంచి 21 వరకు ట్యూషన్‌ఫీజు చెల్లించి సదరు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాలన్నారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

బెల్లంపల్లి : టీజీ పాలిసెట్–2024 ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 20 నుంచి 24 వరకు స్లాట్ బుకింగ్ చేసుకుంటే 22 నుంచి 25 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంద ని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. 22 నుంచి 27వరకు ఆన్‌లైన్‌లో ఆప్ష న్స్ ఇస్తే 27న ఫ్రీజింగ్ విధించి 30లోగా సీట్ల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన బాలబాలికల నుంచి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ 2025 కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి కె. చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల బాలబాలికలు వ్యక్తిగత/ఆయా రంగాల్లో పనిచేసే సంస్థలు తమ దరఖాస్తులను జులై 31లోగా ఆన్‌లైన్‌లో అవార్డు పోర్టల్ https://awards.gov.in లో నమోదు చేసుకోవాలని సూచించారు.